క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



భీమవరంలో ప్యానల్ లాయర్స్‌తో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: సమాజానికి ఎంతో కొంత మేలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి ఎంఏ సోమశేఖర్ అన్నారు. శనివారం ప్యానల్ లాయర్ల సమావేశంలో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు.

విద్యార్థులకు స్టీలు కంచాల పంపిణీ



విద్యార్థులకు స్టీలు కంచాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మండలంలోని గూట్లపాడు, కొత్తపూసలమర్రు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్టీల్ కంచాలు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భూపతి రాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షుడు గ్రంధి కుమార వెంకటేశ్వర వర ప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే పేద, మధ్య తరగతి కుటుంబాల స్థితిగతులు పూర్తిగా సమసిపోతాయని పేర్కొన్నారు. హెచ్ఎం హెచ్ఎంలు అబ్రహం, పీటర్, వైఎస్సార్ ఆంజనేయులు, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్యాణ బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాల అందజేత



అర్చకులకు పట్టు వస్త్రాలు అందిస్తున్న దాతలు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలకు స్వామివారి ఆలయంలో అన్ని విగ్రహాలకు నూతన పట్టు వస్త్రాలను అందించారు. పట్టణానికి చెందిన మట్టా నలిని మోహన్, కనకదుర్గ భవాని దంపతులు శనివారం వీటిని ఆలయ సభ్యులకు అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు, జానపాటి మధు, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- రూ.2.5 కోట్ల వరకు వేతన బకాయిలు
- సకాలంలో కూలి సొమ్ము అందని వైనం
- పని ప్రదేశంలో రక్షణ కరువు



వేంద్రలో కొండయ్య చెరువు పూడిక పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

పాలకోడేరు: గ్రామాల్లోని ఉపాధి కూలీలు ఆకలికేకలు పెడుతున్నారు. వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం ప్రస్తుతం నీరు గారుతోంది. మండలంలో కూలీలకు చెల్లించాల్సిన బిల్లులు రెండున్నర కోట్ల రూపాయలకు పైగా పెండింగులో ఉన్నాయి. రోజూ వారీ మస్తర్లు వేస్తూ బిల్లులు కంప్యూటర్‌లో జనరేట్ చేస్తున్నా డబ్బులు మాత్రం కూలీల ఖాతాల్లో జమ కావడం లేదు. ముఖ్యంగా ఉండి నియోజకవర్గంలో వేల మంది ఉపాధి పనులు చేస్తున్నా నిధుల విడుదల చేయడంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో నెలలు తరబడి వేతన బకాయిలు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారులు రోజూ వారి అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తుంది.

నియోజకవర్గంలో ఉపాధి కూలీలు ఇలా

ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో 1036 మంది, కాళ్ల మండలంలో 803 మంది పాలకోడేరు మండలంలో 1194 మంది, ఉండి మండలంలో 1200 మంది మొత్తం 4033 మందికి పైగా ఉపాధి పనులు చేస్తున్నారు. అయితే ప్రతి కూలీకి కూడా గరిష్ఠంగా రూ. 307 వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి జిల్లా అధికారులు సూచించారు. అయితే ఉండి నియోజకవర్గంలో మాత్రం సరాసరి రూ.270 నుంచి రూ.280 వరకే వేతనం లభిస్తోంది. ఈ లెక్కన దాదాపు ఒక్కొక్క కూలికి రూ 10 వేల నుంచి 16 వేల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరు వ్యక్తులు ఉపాధి పనులకు వెళ్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు ఉపాధి కూలీల బకాయిలు రూ.2,67,26,000 వరకు పేరుకుపోయాయి. ఆర్థిక సంవత్సరం ముగిసినా వేతన బకాయిలు విడుదల చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పని ప్రాంతంలో నిలువ నీడ కరువు

నియోజకవర్గంలో ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నిలువ నీడ లేక మండుటెండలో విలవిల్లాడుతున్నారు. వేసవి వచ్చినా కనీసం టెంట్లు కూడా లేకపోవడంతో కూలీలకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధి పనులు చేస్తుంటారు. ఆ సమయంలో ఎండ తీవ్ర రూపం దాల్చుతోంది. పని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం కోసం కనీసం నీడ కూడా లేకపోవడంతో వడ దెబ్బకి గురవుతున్నారు తాగడానికి మంచి నీరు సైతం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేస్తున్న సమయంలో అప్పుడప్పుడు చిన్న చిన్న దెబ్బలు తగులుతుంటాయి ఆ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి అవసరమైన మెడికల్ కిట్లు కూడా ప్రభుత్వం అందించడం లేదని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీల ఆరోగ్య భద్రత పై చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

దీన్నే నమ్ముకుని బతుకుతున్నాం



ఉపాధి పనులకు వెళితే గతంలో వారం వారం డబ్బులు వచ్చేవి. దీంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే వాళ్ళం అయితే ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో రోజురోజుకూ కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంది. దాదాపు 4 నెలలుగా వేతనాలు ఇవ్వలేదు వడ్డీకి డబ్బులు తెచ్చుకొని రోజువారి అవసరాలను తీర్చుకుంటున్నాం

– కె.జెస్సి ఫ్లోరె, కుముదవల్లి

పని ప్రదేశంలో నీడ కూడా లేదు



వేతనాలు అందక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాం. కేవలం కరువు పనులే మాకు దిక్కు. పని ప్రదేశాల్లో కనీసం నీడ కూడా లేక ఇబ్బంది పడుతున్నాం. తాగడానికి నీటి సౌకర్యం లేదు ప్రస్తుతం ఉదయం నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి

– పెనుమాల మరియమ్మ , మోగల్లు

ఇబ్బంది లేకుండా చూస్తాం



ఉపాధి కూలీల బకాయిలు ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటున్నాం. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ద్రావణాలను పంపిణీ చేస్తున్నాం. కూలీలకు ఇబ్బందులు లేకుండా అవసమైన ఏర్పాట్లు చేస్తాం.

– వి. రెడ్డియ్య. ఎంపీడీఓ. పాలకోడేరు

డ్రోన్స్ సబ్సిడీని వినియోగించుకోవాలి



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం: డ్రోన్ కొనుగోలుకు రైతు గ్రూపులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు, డ్రోన్ గ్రూపు సభ్యులు కన్వీనర్, కో–కన్వీనర్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్ పైలెట్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డ్రోన్ కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రూ.10 లక్షల ఋణమును అందజేస్తుందన్నారు. ఈ నెల 30వ తేదీ లోపు గ్రూపులు కట్టలాని ఐదు లక్షలు బ్యాంకులో జమ చేస్తే, మరో ఐదు లక్షల రూపాయలు బ్యాంకులు మంజూరు చేస్తారన్నారు. మూడు సంవత్సరాలలో నాలుగు శాతం వడ్డీతో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇన్‌స్టాల్‌మెంట్స్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ కొనుగోలు సమయంలో ఒక సంవత్సరం ఇన్సూరెన్స్ రూ.30 వేలు చెల్లిస్తే రెండు సంవత్సరాలు అదనపు వారెంటీ లభిస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణం పరేడ్ గ్రౌండ్‌లో డ్రోన్ ఫ్లై చేయించి పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం ఎ.నాగేంద్ర ప్రసాద్, డీడీఎం నాబార్డ్ టి.అనిల్ కాంత్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం



ఉండిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



ఆకివీడు వైఎస్సార్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: ఓట్లు వేసి గెలిపించిన నిరుపేదలపై అధికార దర్పం చూపించి వారికి నిలువనీడ లేకుండా చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. పాలకోడేరు మండలంలో నిరుపేదల నివాసాల కూల్చివేతను నిరసిస్తూ శనివారం ఉండి మెయిన్ సెంటర్‌లో సీపీయం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలు ఉంటేనే పేదల ఇళ్లను మాత్రమే ఆక్రమణల పేరుతో ఖాళీ చేయిస్తున్నారని, డబ్బు ఉన్నోళ్ల జోలికి మాత్రం వెళ్లడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకూరి వెంకటరత్నం, నిమ్మతి కిశోర్, కింతాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: పేద ప్రజలపై ప్రభుత్వ దమన కాండను వెంటనే ఆపాలని సీపీఎం డిమాండ్ చేసింది. నియోజవర్గంలోని పేదల ఆక్రమణల భూములను నిరంతరం కూల్చడాన్ని ఖండిస్తూ స్థానిక వైఎస్సార్ సెంటర్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపును తక్షణం నిలుపుదల చే యాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 70 ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో జీవిస్తున్న పేదలకు నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపించకుండా దౌర్జన్యంగా తొలగించడం దారుణమన్నారు. ఆక్రమణల తొలగింపులో పెద్దోళ్లకు ఒక న్యాయం, పేదోళ్లకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఆకివీడులో జాతీయరహదారి ఆక్రమించుకుని 50 ఏళ్లగా కోట్లు గడించిన బడా బాబులను పట్టించుకోకుండా, పేదలపై ప్రతాపం చూపడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, బీవీ. వర్మ, డి.రవితేజ, బి.సుబ్బారావు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చడం దారుణం

భీమవరం: పాలకోడేరు మండలం పుంతలో పేదల ఇళ్లను పోలీసు బందోబస్తుతో జేసీబీలతో తొలగించడం దారుణమని భీమవరం ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సీపీఐ నాయకులు వైవీ ఆనంద్, ఎం.లక్ష్మీపతి శనివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరం పట్టణంతో పాటు జిల్లాలోని ముఖ్య కూడళ్లలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు పెత్తందారులు చేతుల్లో ఉన్నా ఆక్రమణలను తొలగించని ప్రభుత్వం పేదలపై ప్రతాపం చూపడం దారుణమని మండిపడ్డారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఆకివీడు: సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆకివీడు: ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై డెమో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో గ్యాస్ సిలిండర్ల ప్రమాదాలను ఎలా అరికట్టవచ్చో? వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ భువన, ఆసుపత్రి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లలో.

కాళ్ల: మండంలోని పెదఅమిరంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం మిత్ర ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రజలకు కరపత్రాలు పంచారు.

తడి చెత్త – పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి



కాళ్ల: పెద అమిరం సచివాలయం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి



భీమవరం (ప్రకాశంచౌక్): ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి



ఉండి: పీహెచ్‌సీ వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి, డాక్టర్ సాయిచంద్ర

కాళ్ల: ప్రజలు తడి చెత్త–పొడి చెత్తను వేరు చేసి ఇచ్చి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్వచ్ఛఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెదఅమిరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇ–వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఇంజినీరింగ్ విద్యార్థులు, స్థానిక ప్రజలు అందజేసిన ఇ–వేస్ట్ ను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి వై.దోసి రెడ్డి, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయకపోతే పర్యావరణానికి హాని కలుగుతుందని జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం పురపాలక సంఘం పరిధిలో శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ–వ్యర్థాల సేకరణకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం పురపాలక సంఘ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. డీఎం అండ్ హెచ్ఓ జి.గీతాభాయి ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ–వేస్ట్ నిర్వహణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. భీమవరం, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆకన లక్ష్మి పాల్గొన్నారు.

పోలీసు ప్రధాన కార్యాలయంలో

భీమవరం: పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఇతర పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి కార్యాలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంల్లో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పరిసరాలు పరిశుభ్రంగా వున్నప్పుడే మన ఆరోగ్యం బాగుంటుందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛాంధ్ర ఈ వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి నాగరాజు, ఎంపీడీఓ రవీంద్ర,ఈవోపీఆర్డో రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇందుకూరి ఈ–వేస్ట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, జేవీటీ నాయుడు, కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్ఎం ఆర్వీఎస్ నారాయణ చెప్పారు. మండలంలోని అజ్జమూరు గరువు ప్రాంతంలో ఎంపీపీ పాఠశాల శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేశారు.

వీరవాసరంలో

వీరవాసరం: స్థానిక గ్రామ పంచాయతీ ప్రాంగణంలో శనివారం ఈ–వేస్ట్ సేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సర్పంచ్ చికిలే మంగతాయారు, కార్యదర్శి లక్ష్మి ప్రారంభించారు. అనంతరం మండలంలోని పంచాయతీ సిబ్బందికి, ప్రజలకి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేంద్ర దివాకర్, దగ్గ రమణ కుమారి పాల్గొన్నారు.

విస్సాకోడేరులో

పాలకోడేరు: స్వచ్ఛ దివస్ కార్యక్రమం లో భాగంగా శనివారం విస్సాకోడేరు గ్రామంలో పాడైపోయిన ఎలక్ట్రికల్ వస్తువులను సేకరించి వాటిని డ్రై–వేస్ట్ కేంద్రాలకు తరలించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి అరుణ శ్రీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించార. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, ఉప సర్పంచ్ కందులు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కాళ్ల: సమావేశం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కాళ్ల: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఉంటుందని ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వి.వాణి విజయరత్నం అన్నారు. కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల స్థాయి పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేవీకే సైంటిస్ట్ దెబోరా మెసియానా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ హేమలత, వి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో...

పాలకోడేరు: మండలంలోని వేంద్ర అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు మల్లిక, పద్మ, కమల, కుమారి పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి అన్నారు. శనివారం చిలుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రాధాన్యతపై సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.